ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

సోమవారం 14 అక్టోబరు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 - కనిష్ఠం : 26.0
తణుకు : 34.0 - 26.0



వాసవీధామ్‌లో దర్బార్ రాజకుమారి అలంకరణలో వాసవీమాత



చిన వెంకన్న పెళ్లి కొడుకాయెనే..

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వరస్వామి పెండ్లి కుమారునిగా, ఉభయ దేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఆలయ అర్చకులు హారతులివ్వగా, వేద విద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ఈ తంతును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈనెల 20 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 17న రాత్రి శ్రీవారి కల్యాణం, 18న రథోత్సవం జరుగుతుంది.

- ద్వారకాతిరుమల





కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి విజయలక్ష్మి అలంకరణ.. గొల్లలకోడేరులో కనకదుర్గమ్మ ఊరేగింపు



కొమ్ముచిక్కాల దసరా ఉత్సవాల్లో చిన్నారులు

పాహిమాం.. రాజరాజేశ్వరి

ముగిసిన దసరా నవరాత్రులు

దసరా నవరాత్రులు శనివారంతో ముగిశాయి. విజయదశమి పర్వదినాన అమ్మవారు రాజ రాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. కుంకుమ పూజలు, అమ్మవార్ల సన్నిధిలో శమీ పూజను నిర్వహించారు. పలుచోట్ల అమ్మవార్ల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నదానాలు చేశారు. పలు చోట్ల పూజల అనంతరం భవానీలు విజయవాడకు పయనమయ్యారు.



వడలిలో జమ్మిచెట్టుకు పూజలు

టెట్ పరీక్ష ప్రశాంతం



తాడేపల్లిగూడెంలో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 13 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ - 2024 పరీక్ష ఆదివారం నాడు భీమవరం డీఎన్నార్ కళాశాలలో ప్రశాంతంగా జరిగిందని డీఈవో జి నాగమణి తెలిపారు. డీఎన్నార్ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా జరిగిన పరీక్షలో 182 మంది అభ్యర్థులకు గాను 157 మంది హాజర య్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. హాజరు86.3 శాతంగా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పరీక్షలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈవో పేర్కొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం పూట జరిగిన పరీక్షలకు 227 మందికి గాను 209 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 221 మందికి గాను 200 మంది హాజరయ్యారు. పరీక్షలను ప్రిన్సిపాల్ రత్నాకరరావు పర్యవేక్షించారు.

పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలి : మంత్రి నిమ్మల

8

లక్కు ఎవరికో..!

- 175 మద్యం దుకాణాలకు 5627 దరఖాస్తులు
- నేడు షాపుల వారీగా లాటరీ తీసి దరఖాస్తుదారుడి ఎంపిక
- 300 మీటర్లు దూరంలో వాహనాల పార్కింగ్



లాటరీ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం,(ఆంధ్రజ్యోతి)/భీమవరం క్రైం, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటు మద్యం విధానం తొలిదశలోనే విజయవంతం అయ్యింది. వ్యాపారులంతా షాపులు దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. జిల్లాలో ఒక్క ఉండి మినహాయించి మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో గట్టిపోటీ నెలకొంది. మద్యం వాపారంలో ఆరితేరిన వ్యక్తులు పదుల సంఖ్యలో డీడీలు సమర్పించి దరఖాస్తు చేసుకున్నారు. భీమవరం సమీపంలోని నిర్మలా ఫంక్షన్ హాలులో లాటరీ పద్ధతి ద్వారా యజమానులను ఎంపిక చేయనున్నారు. వాహనాల పార్కింగ్ కోసం సమీపం లోని 300 మీటర్లు దూరంలోని ఖాళీస్థలాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగిందని తెలిపారు. వాహనాల పార్కింగ్ వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసు కున్నామని అధికారులు తెలిపారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి లాటరీ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో 175 మద్యం షాపులకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తంపైన 5627 దరఖాస్తులు పడ్డాయి. ప్రభుత్వానికి భారీ మొత్తంలోనే ఆదాయం లభించింది. ఎక్సైజ్ శాఖ అంచనాలకు మించి దరఖాస్తులు వెల్లువెత్తాయి. దాదాపు ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రైవేటు వ్యాపారులు తెరపైకి రానున్నారు. కొత్త బ్రాండ్‌లు అమ్మకాలకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం విక్రయాలు చేపట్టింది. ప్రభుత్వ మద్యం షాపులు వెలిశాయి. నాసిరకం మద్యాన్ని విక్రయించారు. మద్యం ప్రియులు ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. అక్రమాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం అభాసుపాలయ్యింది. ధరలు పెంచేశారు. చివరకు జనం నుంచి వైసీపీ ప్రభుత్వం ఛీత్కారాలు ఎదుర్కొన్నది. తాజాగా కూటమి ప్రభుత్వం నాణ్యమైన బ్రాండ్ ధర రూ.100లకు తగ్గించింది. క్వార్టర్ రూ.99లకు విక్రయించనున్నట్టు ప్రకటించింది. నాణ్యమైన బ్రాండ్‌లనే అమ్మకాలు సాగించనున్నారు. మద్యం ప్రియులు కూడా అందుకోసం ఎదురుచూస్తున్నారు.

గట్టి పోటీ

ప్రభుత్వ మద్యం పాలసీపై గట్టిపోటీ నెలకొంది. వైసీపీ హయాంలో వ్యాపారులంతా తెలంగాణ, ఒడిషా రాష్ట్రాలకు వెళ్లిపోయారు. బార్‌లపైనే ఆధారపడ్డారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రైవేటు మద్యంపైనే ఆసక్తి చూపింది. ప్రభుత్వ నిర్వహణలో విమర్శలు ఎదురవుతున్నాయి. వ్యాపారులైతే ప్రభుత్వానికి తలనొప్పి ఉండదు. దాంతో ప్రైవేటుకే మళ్లీ బాధ్యతలు అప్పగిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో మద్యం షాపులకు వేర్వేరుగా లైసెన్స్ ఫీజును నిర్ధారించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్ణీత ఫీజును చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం లాటరీ పద్ధతిలో షాపు యజమానులను ఎంపిక చేస్తారు. అదేరోజు లైసెన్స్ ఫీజు చెల్లించేలా ఏర్పాట్లు చేశారు.

నేతల ఆసక్తి

లాటరీ పద్ధతిలో షాపు యజమానులను ఎక్సైజ్ శాఖ నిర్ధారిస్తుంది. అయినా సరే కొందరు నేతలు తమకు ప్రతిషాపులోనూ భాగస్వామ్యం ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల తమకు కూడా ప్రయోజనం ఉంటుందని వ్యాపారులు ఆశిస్తున్నారు. దాంతో అధికారం ఉన్న నేతలకు భాగస్వామ్యం ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నారు. షాపుల లైసెన్స్‌దారులు నిర్ణయం అయిన తర్వాత నేతల భాగస్వామ్యంపై హడావుడి ఏర్పడనుంది. ఇప్పటికే సిండికేట్‌లుగా వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. ఎవ్వరికి వచ్చినా సరే సిండికేట్‌లో అందరికీ వ్యాపారంలో భాగస్వామ్యం ఉంటుంది. మద్యం ప్రియులు కూడా ప్రైవేటు షాపులకోసం చూస్తున్నారు. తక్కువ ధరకే నాణ్యమైన బ్రాండ్‌లు లభిస్తాయన్న జోష్ వారిలో నెలకొంది.

దరఖాస్తుదారుడికి పాస్ తప్పనిసరి

దరఖాస్తుదారుడు తన అప్లికేషన్ ఫారం, ఎంట్రీ లేదా గేట్ పాస్ తప్పనిసరిగా తీసుకురావల్సి ఉంటుంది. ఒక వేళ దరఖాస్తుదారుడు హాజరుగాని పక్షంలో ఎవరి నైనా పంపిస్తే ఆ వ్యక్తి ఆథరైజ్‌డ్ ఫారంతో పాటు, పాన్, ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ఇవి ఏదైనా తీసుకురా వాలన్నారు.

పారదర్శకంగా లాటరీ

ఆర్‌ఎస్ కుమరేశన్ (జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్)

జిల్లాలో 175 మద్యం దుకాణాలకు 5627 దరఖాస్తులు అందాయి. పారదర్శకంగా లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తాం. ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. దరఖాస్తుదారులు ఉదయం 7గంటలకు నిర్దేశిం చిన భవనానికి రావాలి.

జిల్లాపై అల్పపీడన ప్రభావం

అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం

భీమవరం టౌన్, అక్టోబరు 13 : అల్పపీడనం నేపథ్యంలో జిల్లాలో ఈనెల 14,15 తేదీల్లో తేలికపాటి వర్షాలు, 16వ తేదీన భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనితో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలువలు, వరద నీటి మార్గాల పరిశుభ్రత, పల్లెల్లో కాలువలు, డ్రెయినేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి నిల్వలు, అడ్డంకులను నివారించడం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.

వరి పంట సంరక్షణ: వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తమ పంటలను రాబోయే వర్షాల నుంచి ఎలా సంరక్షించుకోవాలో సూచనలు అందించాలన్నారు. పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

డ్రెయిన్స్, కాల్వల పర్యవేక్షణ: జలవనరుల శాఖ అధికారులు డ్రెయిన్లు, కాలువలలో నీటి మట్టాలను నిరంతరాయంగా పర్యవేక్షించాలన్నారు. నీటి ప్రవాహ స్థాయిలను పర్యవేక్షిస్తూ సమయానుకూలంగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జల వనరుల శాఖ అధికారులు, జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుని అత్య వసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.



నేటి నుంచి పల్లె పండుగ

జిల్లాలో 423 అభివృద్ధి పనులు.. రూ.51.03 కోట్లు ఖర్చు

భీమవరం టౌన్, అక్టోబరు 13 : పల్లెల్లో అభివృద్ధి పండుగ సోమవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందు కోసం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చే శారు. వేడుకల నిర్వహణపై ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు కూడా ఏ రోజున ఏఏ గ్రామాల్లో పల్లె అభివృద్ధి పండగకు సంబంధించి కార్యాచరణ ప్రకటించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తారు.

జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 423 అభివృద్ధి పనులను రూ.51.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. వీటిలో 351 సీసీ రోడ్లకు రూ. 41.94 కోట్లు, 5బీటీ రోడ్లకు రూ.2.46 కోట్లు, 67 సీసీ డ్రెయిన్స్‌కు రూ.6.63 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ సంవత్సరంలో చేసే అభివృద్ధి పనులకు సంబంధించి ఆ గ్రామంలో బోర్డు ఏర్పాటు చెయ్యనున్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో వంద శాతం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి. పంచాయతి సెక్రటరీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పూర్తిచేయాలని, పంచాయతీ సెక్రటరీలు ముందుగానే గ్రామ స్థాయిలో నిర్వహించే పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు సంబంధించి టామ్ టామ్‌తో పాటు ఎక్కడ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసే వాటికి సంబంధించి పంచాయతీల్లో ప్రచారం చెయ్యవలసి ఉంటుంది. పంచాయతీ పరిధిలో చేసే అభివృద్ధి కార్యక్రమాలు, భూమి పూజ వంటి కార్యక్రమాల పూర్తి వివరాలను ప్రజా ప్రతినిధులకు ముందుగానే తెలియజేయాలని పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశాలు అందాయి. పంచాయతీ పరిధిలో ఎక్కడెక్కడ ఏఏ పనులు చేసి, వాటికి సంబంధించి ఎప్పుడు పూర్తి చేస్తారన్న పూర్తి వివరాలను గ్రామ సభలో ప్రజలకు తెలియజేసే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీలు వారీగా మంజూరైన పనుల జాబితాను మండలాలకు తెలపటంతోపాటు మండలాల వారీగా గ్రౌండింగ్ (భూమి పూజ) కోసం గ్రామపంచాయతీలు వారీగా తేదీల వారీగా రోడ్ మ్యాప్ షెడ్యూల్‌ను అమలు చెయ్యవలసి ఉంటుంది.

బస్సులు, రైళ్లు ఫుల్



జనరల్ బోగీల్లో ఎక్కేందుకు నరసాపురం రైల్వే స్టేషన్‌లో క్యూలైన్‌లో బ్యాగ్‌లు పెట్టిన ప్రయాణికులు

◆ దసరా ప్రయాణికుల తిరుగుముఖం ◆ డిమాండ్ ఉన్నా పట్టాలెక్కని స్పెషల్ రైళ్లు ◆ హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నరసాపురం, అక్టోబరు 13: దసరా పండుగకు స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు ఆదివారం తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మందికి రైళ్లలో రిజర్వేషన్ టిక్కెట్లు దొరకలేదు. తత్కాల్ టిక్కెట్ల కోసం ఎదురుచూసినా అది కూడా నిరాశ మిగిల్చింది. ప్రయాణికుల డిమాండ్ ఉన్నా రైల్వే మాత్రం ప్రత్యేక రైళ్లకు పచ్చజెండా ఊపలేదు. చాలా మంది జనరల్ బోగీలను ఆశ్రయించారు. మరికొందరు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో గమ్య స్థానాలకు బయలుదేరారు. ఉదయం నుంచి జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు, టీపీ గూడెం, ఆకివీడు స్టేషన్లు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి. రిజర్వేషన్ టిక్కెట్లు దొరకని ప్రయాణికులు సాధారణ రైళ్లల్లో మారుకుంటూ ప్రయాణాలు చేశారు. అన్ని రైళ్లల్లో రద్దీ కనిపించింది. జనరల్ బోగీలు బయలుదేరే స్టేషన్‌లలోనే ఫుల్ అయిపోయాయి. దీంతో ఇతర స్టేషనలలో ఈ బోగీల్లో ఎక్కాలని ప్రయత్నించిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి దసరాకు గతంలో ఎన్నడూ లేని విధంగా సెలవులు వచ్చాయి. దీంతో ఎక్కువ మంది స్వస్థలాలకు వచ్చారు. పండుగ రెండు నెలలు ముందుగానే రైల్వే రద్దీని గుర్తించింది. 650 స్పెషల్ రైళ్లు ప్రకటించినప్పటికీ వాటిలో జిల్లా మీదుగా నడిచే రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

◆ జిల్లా మీదుగా నడిచే లింగంపల్లి, నాగర్‌సోల్, ధర్మవరం, శేషాద్రి, సర్కార్, విశాఖ, ఎల్‌టీటీ వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లన్ని కిటకిటలాడాయి. ఈ రైళ్లకు రెండు నెలలు ముందుగానే రిజర్వేషన్ టిక్కెట్లు నిండుకున్నాయి. అదనపు బోగీలు జత చేయకపోవడం వల్ల వెయిటింగ్ లిస్ట్‌లు కూడా కదలలేదు. తత్కాల్ రిజర్వేషన్ టిక్కెట్లు కూడా క్షణాల్లో బుక్ అయిపోయాయి. దీంతో ఉన్న టిక్కెట్లతోనే రెళ్లెక్కారు. ప్రతి ఆదివారం రాత్రి నరసాపురం నుంచి హైదరాబాద్‌కు నడిచే స్పెషల్ తప్ప, పండుగ రద్దీ పేరు చెప్పి ఒక్క ప్రత్యేక రైలు కూడా పట్టాలెక్కలేదు. ఈ స్పెషల్ రైలుకు కూడా ముందుగానే టిక్కెట్లు నిండుకున్నాయి. దీంతో జిల్లా మీదుగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

◆ ఆర్టీసీ ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకొని హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం 16 స్పెషల్ బస్సులు నడిపింది. రెగ్యులర్‌గా ప్రతి రోజు నడిచే 20 సర్వీసులు కాకుండా నరసాపురం 4, తణుకు 5, భీమవరం 4 టీపీ గూడెం 3 సర్వీసులు చొప్పున సాయంత్రం ఆరు నుంచి రాత్రి 10 గంటల మధ్య బయలేదేరాయి. అయితే విశాఖ వెళ్లే ప్రయాణికుల కోసం ఎటువంటి ఆదనపు సర్వీసులు నడపలేదు. ఉత్తరాంధ్ర వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొందురు చేసేది లేక బస్సులు మారుకుండా గమ్య స్థానాలకు బయలుదేరారు.

లోకాయుక్త విచారణ

- తాడేపల్లిగూడెంలో అవకతవకలపై టీడీపీ ఫిర్యాదు
- అప్పటి అధికారుల వివరాలు కోరిన ఆర్జేడీ
- టీడీఆర్, బిల్లులు మంజూరుపై దృష్టి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో టీడీఆర్ బాండ్‌లు, బిల్లులు మంజూరుపై లోకాయుక్త విచారణ చేపడుతోంది. గతంలో అధికారులు టీడీఆర్ బాండ్‌లు, బిల్లులు మంజూరులో అవకతవకలకు పాల్పడ్డారంటూ తెలుగుదేశం ఇన్‌చార్జి వలవల బాబ్జి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై మునిసిపల్ శాఖ డైరెక్టర్ వివరణ కోరారు. లోకాయుక్తకు వివరాలు అందజేయనున్నారు. ఈ మేరకు మున్సిపల్ ఆర్జేడీ తాడేపల్లిగూడెం మునిసిపాలిటీకి ఆదేశాలు జారీ చేశారు. తెలుగుదేశం ఇన్‌చార్జి ఫిర్యాదు చేసిన అంశాలకు సంబంధించి అప్పటి అధికారులు, సిబ్బంది వివరాలు అందజేయాలని సూచించారు. కమిషనర్ డాక్టర్ శామ్యూల్ తదితరులు అప్పట్లో విధులు నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణలో వాహనాలు, డీజల్ బిల్లులు చెల్లింపులో అవకతవకలు జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. అలాగే గ్రీనరీ పేరుతోనే బిల్లులు మంజూరు చేశారు. ఏలూరు కాలువ గట్టు పరిశుభ్రత కోసమని రూ.16 లక్షలు చెల్లించారు. మొత్తంపైన చెట్లు తొలగింపు, పెంపకంపై స్వల్ప కాలంలోనే రూ.80 లక్షలు బిల్లులు మంజూరు చేశారు. మున్సిపల్ కమిషనర్ క్వార్టర్‌లో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేసిన అధికారి నివాసం ఉండేలా చర్యలు తీసుకున్నారు. అనధికారికంగా ఆశ్రయం ఇచ్చారు. టీడీఆర్ బాండ్‌లు మంజూరు తదితర అంశాలన్నింటిపైనా లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లింది. దాంతో మున్సిపల్ శాఖ నివేదిక కోరింది. లోకాయుక్త విచారణపై మున్సిపాలిటీలో కలకలం రేగింది. గతంలో పనిచేసిన అధికారులు తప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బందిపై తప్పును మోపే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌లపై మున్సిపల్ డైరెక్టర్ శాఖ వివరాలు కోరింది. వాస్తవానికి సీబీసీఐడీ విచారణ చేపట్టాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. తణుకులో మంజూరైన బాండ్‌లపై సీబీసీఐడీ ఇప్పటికే రంగంలోకి దిగింది. తాడేపల్లిగూడెంపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వరుడైన చిన్నతిరుమలేశుడు

ఘనంగా ప్రారంభమైన ఆశ్వయుజ బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: ముగ్ధమంద హాసంతో శ్రీదేవి, భూదేవీల నడుమ కొలువైన చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. చిరునగవులు చిందిస్తూ... అపురూపలావణ్యాలతో బుగ్గన చుక్కలు, పట్టు పీతాంబరాలను ధరించి విశేష అలంకారాల్లో కొలువైన ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు తోడైన వేళ.. ఈ అద్భుత వేడుకను వీక్షించిన భక్తజనులు పరవశించారు. శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణ ఆదివారం ఉదయం ఇందుకు వేదికైంది. ప్రత్యేకంగా అలంకరించిన ఈ వేదికపై ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును వేద విద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి, ఆ తరువాత స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.


స్వామి, అమ్మవార్లను అట్టహాసంగా నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొస్తున్న దృశ్యం, శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులు(ఇన్‌సెట్)

శ్రీమహావిష్ణువుగా చినవెంకన్న


శ్రీమహావిష్ణువుగా చినవెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు ప్రతీ రోజూ ఓ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. ఇందులో తొలిరోజైన ఆదివారం శంఖు, చక్ర గదా ధారియై ఉభయదేవేరులతో విశేష పుష్పాలంకారాల్లో మహా విష్ణువు అలంకారంలో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.
- ద్వారకాతిరుమల

కళకళలాడిన శ్రీవారి క్షేత్రం


వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులు, భవానీలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: విజయదశమి పర్వదినాల నేపథ్యంలో భవానీ దీక్షాదారులు, భక్తులతో చినవెంకన్న క్షేత్రం ఆదివారం కిటకిటలాడింది. అందరికీ వారాంతపు సెలవు రోజు కావడం, అలాగే విజయవాడలో దుర్గమ్మను దర్శించిన వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా మార్గమధ్యలో ఉన్న శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. ఉదయం నుంచే ఆలయానికి యాత్రికులు, భవానీల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు సందడిగా మారాయి, వేలాది మంది యాత్రికులు, భవానీ దీక్షాదారులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

క్షేత్రంలో నేత్రపర్వంగా శమీ పూజ

రాజాధిరాజ వాహనంపై శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కొలువుదీరిన చినవెంకన్న విజయదశమి పర్వదినాన శమీపూజ నిమిత్తం నృశింహసాగరం వద్ద నున్న దసరా మండపానికి వెళ్లి పూజలందుకున్నారు. ముందుగా ఆలయంలో రాజాధిరాజ వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ క్షేత్రపుర వీధులలో భక్తుల హారతులు అందుకుంటూ నృశింహసాగరం వద్దనున్న మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి ముందుగా ఉన్న జమ్మి చెట్టుకు అర్చకులు విశేషపూజలు చేసి హారతులిచ్చారు. విజయముహూర్త సమయంలో శమీ వృక్షం అంటే జమ్మిచెట్టుకు పూజ చేస్తే సకల దోషాలు హరిస్తాయని, పాండవులు అజ్ఞాతవాసానికి ముందు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపైనే ఉంచారన్నది భారతం చెప్పే కథ. పూజ అనంతరం భక్తుల నుంచి హారతులందుకుంటూ శ్రీవారు ఆలయానికి చేరుకున్నారు.


నృశింహసాగరం వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేసి హారతులిస్తున్న అర్చకులు

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి విరాళం

ఉండి అక్టోబరు 13: ఉండి నియోజకవర్గ డ్రెయినేజీ, పంట కాలువలు అభివృద్ధికి రూ.కోటి విరాళం అందిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు బీఎంఆర్ సంస్థ ఎండీ బీద మస్తాన రావు ప్రకటించారు. పార్లమెంటులో రఘురామ కృష్ణరాజు తాను మంచి మిత్రులుమంటూ ఆయన గుర్తు చేశారు. ఆక్వా రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు అభినందించారు. అనంతరం ఆక్వా రైతు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పేరిచర్ల కృష్ణంరాజు(బాలరాజు) ఏర్పాటు చేసిన విజయ ఎంటర్ ప్రైజెస్ ఆక్వా ఏజెన్సీని ఎమ్మెల్యే కనుమూరు రఘురామరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మాజీ టీడీపీ కన్వీనరు గొట్టుముక్కల సత్యనారాయణరాజు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ ఆక్వా రైతులకు అందుబాటులో బీఎంఆర్ ఫీడ్‌ను ఉంచడం శుభసూచకమన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గంధ్రాజు నరసింహరాజు, కరిమెరక నాగరాజు, కందుల బలరాం, తోట రాము, యడవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


శ్రీవిజయలక్ష్మీ ఆక్వా ట్రేడర్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామ, రామరాజు, మస్తాన్‌రావు, సత్యనారాయణరాజు తదితరులు

హోరాహోరీగా చెడుగుడు పోటీలు



నూజివీడు టౌన్, అక్టోబరు 13: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నూజివీడు డీఏఆర్ కళాశాలలో అఖిలభారత చెడుగుడు పోటీలను నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఐదు పురుషుల జట్లు, ఐదు మహిళా జట్లు హాజరు కాగా, తొలిరోజు క్రీడా పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగాయి. తొలిరోజు పురుషుల జట్ల మధ్య రెండు క్రీడాపోటీలను నిర్వహించగా, తొలి చెడుగుడు పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. ఇందులో 51-22 స్కోరుతో పశ్చిమగోదావరిపై ఎన్టీఆర్ జిల్లా జట్టు గెలుపొందగా ఇక రెండో క్రీడా పోటీ విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య సాగింది. 38-35 స్కోరుతో శ్రీకాకుళంపై విజయనగరం జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన మహిళా చెడుగుడు పోటీల్లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు తొలుత పోటీ పడ్డాయి. ఇందులో 33-20 స్కోరుతో గుంటూరుపై శ్రీకాకుళం విజయం సాధించగా, 2వ పోటీ కృష్ణా, విజయనగరం జట్ల మధ్య జరుగగా 22-35 స్కోరుతో కృష్ణాపై విజయనగరం విజయం సాధించింది. ఇక రెండో రోజు క్రీడా పోటీలు వర్షం కారణంగా దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

వైదిక విధుల్లో అర్చకులకు వెసులుబాటు

- ఇతరుల జోక్యానికి తిలోదకాలు
- తుది నిర్ణయం అర్చకులదే
- కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జీవో విడుదల

అర్చన అంటే పూజ.. అర్చకుడు, పూజారి పర్యాయపదాలు. పుర అంటే ఎదుట వ్యక్తికి రానున్న కాలంలో ఉండబోయే పరిస్థితి దర్శించి శాస్త్ర సమ్మతంగా చెప్పేవాడు పురోహితుడు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పురోహితులకు ఐదేళ్లలో ప్రాధాన్యత చాలా వరకు తగ్గింది. ఆలయాల్లో రాజకీయ జోక్యాలు పెరిగిపోయి పూజలు మమ అనిపించే పరిస్థితి. ఇక నుంచి దేవాలయాలకు సంబంధించిన ఏదైనా వైదిక పూజలు, యాగాలు వంటి కార్యక్రమాలలో అర్చకులదే తుది నిర్ణయం. గత ప్రభుత్వ హయాంలో ఆలయాల్లో ఆగమ విషయాలను పక్కనపెట్టి కార్యక్రమాలు జరిగిన నేపథ్యంలో వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక నుంచి ఉత్సవాల నిర్వహణలో అర్చకుల నిర్ణయమే కీలకంగా మారింది. పూజల విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఎక్కువ కావడంతో అర్చకులు నామమాత్రంగా ఉంటున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు చెప్పినట్లుగా నడుచుకోనే పరిస్థితి ఉంది. ఇక నుంచి అటువంటి పరిస్థితికి స్వస్తి పలికింది కూటమి ప్రభుత్వం.



భీమవరం టౌన్, అక్టోబరు 13 : దేవాలయాల్లో పూజలు, సహా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ విషయంలో కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఆయా దేవాలయాల్లో వైదిక కార్యక్రమాలలో ఇతరుల జోక్యం లేకుండా అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 500 వరకు ఉన్న దేవాలయాలకు ఈ విధానం అమల్లోకి రానుంది. దేవదాయ కమిషనర్ సహా ఏ స్థాయి అధికారి అయినా వైదిక విధుల్లో జోక్యం చేసు కోకూడదని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో ఆదేశాలు జారీ చేసింది. అర్చకులకు విశేష అధికారాలు కట్టబెట్టిన ప్రభుత్వం. పూజలు, సేవలు, యాగాలు, కుంభాభిషేకాల వంటి వాటిల్లో అధికారుల పాత్రని పరిమితం చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా దేవాలయాల ఆగమం ప్రకారం వైదిక విధులు నిర్వహించుకునేలా అర్చకులకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆధ్యాత్మిక విధుల విషయంలో అర్చకులదే తుది నిర్ణయమని స్పష్టం చేసింది.

వైదిక కమిటీలు ఏర్పాటు

ఇక ఆలయాల్లో వైదిక కమిటీలు ఏర్పాటుకు చర్యలుతీసుకోవాలని జీవో పేర్కొంది. ఏదైనా ఆధ్యాత్మిక విషయాల్లో ఏర్పాటు చేసి వైదిక కమిటీలో ఏకాభిప్రాయం కుదరకుంటే సంబంధిత ఆగమ పీఠాధిపతుల సలహాలు తీసుకోవాలని జీవోలో వెల్లడించింది. ఆయా దేవాలయాల ఆగమ శాస్త్రాల ప్రకారమే వైదిక విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐతే చిన్న దేవాలయాలకు సంబంధించి వైదిక కమిటీ ఏర్పాటు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలా లేదా మండల స్థాయిలో ఉంటుందా అనేది స్పష్టం లేకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు ఇటువంటి కమిటీలు లేకపోవడంతో ఏదైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే ఆలయ ఈవోలదే నిర్ణయంగా మారింది. ఇక నుంచి ఉత్సవాలకు సంబంధించి అధికారులు పాత్ర నామమాత్రంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ళు ఇంకా ఏర్పాటు కాలేదు. అవి వచ్చిన తరువాత ఎలా ఉంటుందనే దానిపై ప్రస్తుతం చర్చ సాగుతోంది.

సముచితంగా ఉంది



దేవాలయల్లో పూజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైదిక కమిటీలను ఏర్పాటు చేయడం అభినందనీయం. అర్చకులకు తుది నిర్ణయంగా నిర్ణయించడం సముచితంగా ఉంది.
- పెద్దింటి పురుషోత్తమాచార్యులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే ఆరిమిల్లి

నేటి నుంచి గ్రామదర్శిని



తణుకు, అక్టోబరు 13 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణం అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ ప్రతి గ్రామం, పట్టణం తిరిగి అనేక సమస్యలు పరిష్కరించానని, ఇపుడు అదే తరహాలో సోమవారం నుంచి అత్తిలి మండలం కేపీఎస్‌గట్టు నుంచి గ్రామదర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టాతానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని పరిష్కరించాలనేది ప్రధానుద్దేశ్యం అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ గ్రామదర్శినిలో అన్ని శాఖలు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. స్థానికంగా ప్రజలు నుంచి వచ్చిన వినతులును బట్టి అక్కడికక్కడే పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, రూరల్ మండలంలోని 48 గ్రామాలతో పాటు, 34 వార్డుల్లో పర్యటన సాగుతుందన్నారు. పర్యటనలో సమస్యలు పరిష్కరించడమే ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే తెలిపారు. తణుకు, అత్తిలి, ఇరగవరం, మండలాలకు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇప్పటికే రూ.ఏడు కోట్లు ఎన్ఆర్ఈ జీఎస్ నిధులు మంజూరు అయ్యాయన్నారు. తణుకునకు రూ.17.7 కోట్లు, అత్తిలికి రూ.290.7 కోట్లు, ఇరగవరంనకు రూ.234.6 కోట్లు చొప్పున మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆరిమిలి వెల్లడించారు.

పోలీసుల మంటూ.. డబ్బులు వసూళ్లు

మొగల్తూరు, అక్టోబరు 13 : పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జి.వాసు ఆదివారం తెలిపారు. పేరుపాలెంసౌత్‌కి చెందిన మండా శ్రీనివాస్, అతని సోదరుడు అనిల్ కుమార్ ఈ నెల 11న బీచ్ రోడ్డులో మాట్లాడుకుంటుండగా అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై వచ్చి తాము పోలీసులమని వారి నుంచి రూ.500లు బలవంతంగా వసూలు చేశారు. దీంతో వారికి అనుమానం వచ్చి వారిని మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిజమేనని తేలడంతో భీమవరం మండలం రాయలంకకు చెందిన దవులూరి సువర్ణరాజు, అదే గ్రామం దిరుసుమర్రుపేటకు చెందిన వర్ధనపు ప్రసాద్, భీమవరం మండలం శ్రీరామపురంనకు చెందిన మండా కిరణ్ కుమార్‌ను శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్ళు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ముద్దాయిలు ముగ్గురు ఒక మెరైన్ కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు.

తల్లి మరణాన్ని తట్టుకోలేక ఆగిన కుమారుని గుండె

పెదవేగి, అక్టోబరు 13 : వృద్ధాప్యంతో మృతి చెందిన తల్లికి కర్మకాండలు పూర్తి చేసిన కుమారుడు రోజు గడవకముందే గుండె ఆగి మరణించాడు. ఒక రోజు వ్యవధిలో తల్లీకుమారులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన ఏనుగు గంగమ్మ(80) శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకటేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ప్పటి నుంచి ఎవ్వరితోనూ మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నాడు. ఆ రాత్రి నిద్రించిన వెంకటేశ్వరరావు శనివారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. రోజు వ్యవధిలో తల్లీ, కుమారుడు మృతి చెందడంతో బంధువులు విషాదంలో మునిగారు. చిన్నతనం నుంచి తల్లి గంగమ్మ అంటే ఎనలేని ప్రేమను పెంచుకున్న కుమారుడు వెంకటేశ్వరరావు(50) తల్లి మృతిని జీర్ణించుకోలేక గుండెపోటుకు గురై మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ళ వయస్సులోనే తండ్రిని కోల్పోగా, అప్పటినుంచి తల్లి, కుమారుడు ఒకరి కొకరుగా జీవించారని, వెంకటేశ్వరరావుకు పెళ్ళై ఇద్దరు పిల్లలకు తండ్రి అయినా.. తల్లితో తన అనుబంధాన్ని వీడలేదని, ఇప్పటికీ తల్లి మాటే వేదంగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. అలాంటి తల్లి వృద్ధాప్యంతో మృతి చెందినా ఆ నిజాన్ని తట్టుకోలేక తెల్లారేసరికి తల్లి దగ్గరకే వెళ్ళాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.


వెంకటేశ్వరరావు(ఫైల్)

క్రైమ్ కార్నర్

వేర్వేరు ఘటనలలో పలువురి మృతి

విద్యుదాఘాతానికి యువకుడి మృతి


రమేష్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ముత్యాలంబపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలంబపురం అమ్మవారి ఆలయ మాజీ ఛైర్మన్ అన్నంనీడి శ్రీనివాస్ కుమారుడు అన్నంనీడి రమేష్ (32) అమ్మవారి ఊరేగింపు సందర్భంగా కాలువలో తల స్నానం చేసి అమ్మవారిని రథం ఎక్కించారు. అనంతరం ఇంటి దగ్గర ఉన్న బడ్డి దగ్గర షార్ట్ సర్క్యూట్ అవుతుందని చూసేందుకు స్విచ్‌లు చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టడంతో కింద పడి పోయాడు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో అమ్మవారి ఊరేగింపు నిలుపుదల చేశారు. రమేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పెదవేగి మండలంలో..

పెదవేగి, అక్టోబరు 13 : జేసీబీని నీటితో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జగన్నాథపురానికి చెందిన మాత్రపు వెంకటేశ్వరరావు అదే గ్రామానికి చెందిన సమీప బంధువుకు చెందిన జేసీబీపై పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం జేసీబీని మోటారు ఉపయోగించి పైపు ద్వారా నీటితో శుభ్రం చేస్తున్నాడు. ఈ సమయంలో మోటారు నుంచి నీటి ద్వారా విద్యుత్ ప్రవహించి, మాత్రపు వెంకటేశ్వరరావు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. పంచనామా అనంతరం శవ పరీక్షకు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద రైల్వే స్టేషన్ దాటిన తరువాత సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న ఒక వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు గులాబి రంగు పొట్టి చేతుల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్‌నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి చెందింది. ఏలూరు పాండురంగపురంనకు చెందిన వీరంకి విజయలక్ష్మి (77) ఏలూరు బావిశెట్టివారిపేట సమీపంలో ఉన్న కనక దుర్గమ్మ ఆలయానికి పూజలకు వెళ్ళి అనంతరం అక్కడ ఉన్న కాలువ రేవులో కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధురాలు ఆదివారం మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గురకలపేటలో నివాసముంటున్న మోరు అంతిర్వేజమ్మ (68) ఆమె భర్త కలిసి ఉంటున్నాడు. ఈ నెల ఏడున గ్యాస్ స్టౌ వెలిగించగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుగొండ, అక్టోబరు 13: కుటుంబ కలహాలతో జొన్నాల గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నటి రాజేశ్వరి(35) భర్త వెన్నటి శ్రీనివాసులు శనివారం రాత్రి గొడవ పడ్డారని, మనస్థాపంతో అదే రోజు ఆమె ఆత్మహత్యాయత్నం చేయగా భర్త అడ్డుకున్నాడని బంధువులు తెలిపారు. ఆదివారం ఉదయం రాజమండ్రి బస్సు ఎక్కి వెళుతుండగా భర్త శ్రీనివాస్ కూడా వెనుక బస్సులో ఆమె కోసం వెళ్లాడని తెలిపారు. అప్పటికే ఆమె జొన్నాడ గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకడంతో స్థానికులు గుర్తించి జాలర్ల సహాయంతో ఆమెను బయటకు తీసి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. భర్త రాజమండ్రి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వెతుకుతుండగా రావులపాలెం పోలీసుల నుంచి సమాచారం అందడంతో ఆస్పత్రికి వెళ్లినట్లు బంధువులు వెల్లడించారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: పంట చేలలో నిర్జీవంగా పడిఉన్న ఓ వృద్ధుడిని చనిపోయాడని భావించి రైతులు పోలీసులకు సమాచారం అందించగా పోలాసులు ఆ వృద్ధుడిలో కదలిక గమనించి కాపాడిన ఘటన పోచమ్మపురంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదతాడేపల్లి శివారు పోచమ్మపురం పంట చేలలో ఓ వృద్ధుడు పడి ఉండటాన్ని స్థానిక రైతులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ వృద్ధుడిని బయటకు తీసేందుకు వెళ్లగా అతడు కదలడం గమనించి వెంటనే బయటకు తీసి బురద కడిగారు. ఆ వృద్ధుడు కదలలేని స్థితిలో ఉండడంతో సపర్యలు చేసి అన్నం తినిపించి తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడు బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

పిడుగుపాటుకు విద్యుత్ సామగ్రి దగ్ధం

మొగల్తూరు, అక్టోబరు 13: పిడుగు పాటుకు మొగల్తూరులోని పలు నివాసాల్లో విద్యుత్ సామగ్రి కాలిపోయాయి. ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పడిన పిడుగుపడటంతో ఆ ప్రాంతంలోని నివాసాల్లో గల టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మిషన్‌లు, ఇన్వెటర్‌లు కాలినట్టు స్థానికులు తెలిపారు.

బంగారం చోరీ

ఇంటి తాళాలు పగులగొట్టి..

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : తాళం వేసి ఊరువెళ్లి వచ్చేటప్పటికి దొంగ లు ఇంటి తాళాలు పగులగొట్టి ఆరుకాసుల బంగారు ఆభరణాలు అపహ రించుకుపోయారు. ఏలూరు శాంతినగర్ 3వ రోడ్డులో నివాసముంటున్న రేకపల్లి సౌజన్య ఈ నెల 7న కుటుంబ సభ్యులతో చెన్నై వెళ్లి తిరిగి 13వ తేదీ ఉదయం వచ్చారు. 12వ తేదీ అర్ధరాత్రి రెండు గంటలకు ఒక దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలు కూడా పగులగొట్టి ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికా ర్డు అయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారికాచి..

భీమవరం క్రైం, అక్టోబరు 13 : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యభర్తల్ని అడ్డగించి బెదిరించి మెడలో ఉన్న బంగారుతాడును గుర్తు తెలియకుండా దుండగులు దోచుకెళ్లారు. భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలం యనమదుర్రుకి చెందిన మడ్డి ఆదినారాయణ ఈ నెల 11న భార్యతో కలిసి, ద్విచక్ర వాహనంపై భీమవరం ఆస్పత్రికి వచ్చి రాత్రి 10 గంటలకు తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుకాల ఒక మోటార్ సైకిల్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వాహనాన్ని ఆపమన్నారు. అనంతరం ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు తాడుని లాక్కుని పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

వరద బాధితులకు రూ.1,11,111 విరాళం


ఎమ్మెల్యే అంజిబాబుకు చెక్కును అందిస్తున్న బార్ అసోసియేషన్

భీమవరంటౌన్, అక్టోబరు 13 : వరద బాధితులకు దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం భీమవరం బార్ అసోసియేషన్ రూ1,11,111 సహాయాన్ని ఆదివారం అందించారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకట్రావు, జనరల్ సెక్రటరీ అడపాల ప్రసన్నకుమార్, కె.భాగ్యలక్ష్మి, కోశాధికారి సీహెచ్ వరాలరావు, జాయింట్ సెక్రటరీ జె.సత్యనారాయణ, కె.ప్రతాప్, ఎం.మల్లేష్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తా : రఘురామ


గొల్లలకోడేరులో ఎమ్మెల్యే రఘురామకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పాలకోడేరు/ఉండి, అక్టోబరు 13: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అన్నారు. పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరు, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ గ్రామాల్లో ఆదివారం రహదారుల నిర్మాణానికి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఆయన భూమి పూజలు చేశారు. సర్పంచ్‌లు కుక్కల లక్ష్మి, బొల్లా శ్రీనివాస్, ఇంజేటి మరియమ్మ, టీడీపీ నాయకులు కొత్తపల్లి నాగరాజు, కమ్మిలి రాంబా బు, కామన రాంబాబు, జడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మి, సుబ్రహ్మణ్యం, సూర్యనారా యణరాజు, కలిదిండి శ్రీనివాసవర్మ, కునాధరాజు మురళీకృష్ణం రాజు, కొత్తపల్లి ఏడుకొండలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండిని మోడల్‌గా తీర్చిదిద్దుతా..

ఉండి నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం ఉండిలో చిక్కాల వీరన్ననగర్‌లో రూ.12లక్షలతో నిర్మించే రెండు సీసీ రహదారులకు ఆయన భూమిపూజ చేశారు. సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జి అధ్యక్షత వహించారు. ఎంపీటీసీ కునుకు రమాదేవిశ్రీను, కాగిత బుజ్జి, మజ్జి కృష్ణప్రసాదు, మంతెన సాయిలచ్చిరాజు, ముదునూరి కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ అగ్రహారంలో రూ.10లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీకి భూమిపూజ చేశరు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, కొత్తకోట అనిల్, గ్రామకార్యదర్శి జేవీటీ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి : ఆరిమిల్లి


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు 13: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం వేల్పూరులోని ఆరిమిల్లి వెంకటరత్నం జడ్పీ హైస్కూల్‌లో చదివిన మెరిట్ విద్యార్థులకు ఫీజులు నిమిత్తం శ్రీవిద్యానిధి వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. వేల్పూరులో మాజీ సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 2016లో ప్రారంభించిన ట్రస్టు ద్వారా దాతల సహకారంతో ప్రతియేటా గ్రామంలోని ఆరిమిల్లి వెంకటరత్నం హైస్కూలు విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. 2024 సంవత్సరంలో 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. పదివేలు చొప్పున రూ. లక్షా 50 వేలు అందించామన్నారు.

పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

భీమవరంటౌన్, అక్టోబరు 13 : జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభరాణి తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారికి స్ర్కీనింగ్ టెస్టు నిర్వహించి ఆ టెస్టులో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీ ఇచ్చి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్న వారిని ఎంపిక చేస్తామన్నారు. స్థానిక సచివాలయంలో ఆరు ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 21 చివరి తేదీకి నిర్ణయించామన్నారు. కోచింగ్ ఎంపిక కోసం ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్టు 27న నిర్వహిస్తామన్నారు.

'వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి'

ఆకివీడు, అక్టోబరు 13 : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తక్షణమే వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక శాంతినగర్‌లో కామ్రేడ్ స్థూపం దగ్గర సీతారాం ఏచూరి, ఆర్ఎస్ఆర్ చిత్రపటాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డుల్లో తాగునీరు, రహదారులు తదితర సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. బి.రాంబాబు, బత్తిలి పార్వతి, అప్పారావు, కింజరాపు శంకరు, వరాలమ్మ, కె.తవిటమ్మ, పొదిలాపు కుమారి, లింగాల బలరాం, కె.గౌరినాయుడు ఉన్నారు.

విలువలు, నిజాయితీకి రతన్ టాటా నిదర్శనం

భీమవరంటౌన్, అక్టోబరు 13 :విలువలు, నిజాయితీకి రతన్ టాటా నిదర్శనమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీవిజ్ఞాన వేదిక, స్వచ్ఛంద సంస్థల సంఘాల ఆధ్వర్యంలో రతన్ టాటా సంతాప సభ నిర్వహించారు. రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిల్డర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, ఆరేటి ప్రకాష్, చినిమిల్లి వెంకట్రాయుడు, వబిలిశెట్టి రామకృష్ణ ఆయన సేవలను కొనియాడారు. చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏరియా వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యుల ఎంపిక

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 : స్థానిక వాకర్స్ సీనియర్ సభ్యుడు, న్యాయవాది జీవీ సుబ్బారావు నివాసంలో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ గుంటూరి రామరాజు ఆధ్వర్యంలో ఏరియా కమిటీ సభ్యుల ఎంపిక జరిగింది. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కర్నా జయసరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా జీవీ సుబ్బారావు ఎన్నికయ్యారు. సీనియర్ సభ్యులు ఆకి రామకృష్ణ, కాగిత సూర్యనారాయణ, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ తటవర్తి సుధాకర్, కీరపురి వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరం క్రైం, అక్టోబరు 13 :** భీమవరం రెండో పట్టణంలోని పాత గోవర్ధన్ థియేటర్ సందులో ఒక షెడ్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.37,150 స్వాధీనం చేసుకున్నామని సీఐ కాళీచరణ్ తెలిపారు.
- **భీమవరం క్రైం :** అనాకోడేరు గ్రామ పరిధిలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, ఒక కోడి పుంజు, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపారు.
- **తాడేపల్లిగూడెం అర్బన్:** పేద మహిళ కాళిదాసు మంగమ్మ అనే వితంతువుకు రూ. 2 వేలు విలువైన బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశామని ఏ లిటిల్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు చోళ్ళ నందకిషోర్ తెలిపారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరంను మాతృమూర్తి వెంకాయమ్మ చనిపోవడంతో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు.
- **పోడూరు :** వేడంగి గ్రామంలోని యర్రంశెట్టి కాలనీలో పంచాయితీ నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ చెల్లబోయిన పద్మపార్వతీ శారద శంకుస్థాపన చేశారు.


నరసాపురంలో ట్రాక్టర్‌పై కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు


యలమంచిలిలో కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు


మావుళ్ళమ్మకు వెండి బహూకరిస్తున్న దాత కృష్ణావతారం


విశ్వదుర్గేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న వలవల బాబ్జి తదితరులు

వైభవంగా విజయదశమి పూజలు

రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం
ముగిసిన శరన్నవరాత్రి మహోత్సవాలు

వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. పలు ఆలయాలతో పాటు, పలు సెంటర్లలో వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవార్లు రాజరాజేశ్వరిదేవి అలంకరణల్లో దర్శనమిచ్చారు.

- భీమవరంటౌన్ అక్టోబరు 13 : మావుళ్ళమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ప్రారంభించారు. ప్రత్యేక వాహనంలో ఉత్సమూర్తికి పూజలు చేసి హారతులు అందించారు. సాయంత్రం ఆలయ మండపంలో శమిపూజ నిర్వహించారు. అమ్మవారిని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దర్శించుకుని పూజలు చేశారు.
- మావుళ్ళమ్మ అమ్మవారికి ఆదివారం పట్టణానికి చెందిన శ్రీగుండు నాగవెంకటకృష్ణావతారం 250 గ్రాముల వెండిని, తెలంగాణ కల్వకుర్తికి చెందిన కవితాఆనంద్ 303 గ్రాములు వెండి కానుకగా అందజేశారు. మావుళ్ళమ్మను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలుచేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాలు శేషవస్త్రం ఫొటో అందించారు.
- భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా మహోత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య యువజన సంఘం వారి ఆధ్వర్యంలో 108 మంది ముత్తైదువులతో ఆదివారం లక్ష పసుపు కొమ్ముల తో సహస్ర అష్టోత్తర నామాల పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహా నివేదన చేసి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఆకివీడు/ఆకివీడు రూరల్/కాళ్ల/పాలకోడేరు : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆకివీడులో పెద్దింట్లమ్మ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శమీపూజ ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆకవీడు మండలం గుమ్ములూరు, జానకీరామరాజుపురం, కుప్పనపూడి, చెరుకుమిల్లి, అయిభీమవరం, సిద్దాపురం, దుంపగడప గ్రామాల్లో అమ్మవార్ల విగ్రహాలు ఊరేగించి నిమజ్జనం చేశారు. కాళ్ల మండలం కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయలక్ష్మి అమ్మవారు అలంకరణలో దర్శనం ఇచ్చారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో కనకదుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహించారు.
- ఆచంట/పోడూరు/పెనుగొండ : ఆచంట పార్వతి అమ్మవారు, పెద మల్లం మాచేనమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం కనకదుర్గమ్మ అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో క్షత్రియ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకలు గ్రామానికి చెందిన జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ గుంటూరి వాణి దంపతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. చిన్నారుల కోలాట భజనలు, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెనుగొండ మండలం పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో వాసవి అమ్మవారు దర్బార్ రాజకుమారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శమీ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారా యణ విచ్చేసి పూజలు చేశారు. వడలి గ్రామంలో కమ్మవారి రామాలయం వద్ద ఉన్న శమీ వృక్షం పూజలను అర్చకులు మణికంఠ ఉప్పలపాటి శ్రీనివాస్ దంపతులు పూజలు చేశారు.
- నరసాపురం/మొగల్తూరు : శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆదివారం పట్టణంలోని వలంధర్ రేవులో అమ్మవారి నిమజ్జనాలు జరిగాయి. స్టీమర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు మండెల కృష్ణ, గునిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జి.వాసు, పండితులు కొత్తలంక బాపన్న ఆయుధ పూజలు నిర్వహించారు.
- పాలకొల్లు అర్బన్/యలమంచిలి : దసరా ఉత్సవాలు పది రోజులు, అంతకు ముందుగా 15 రోజుల పాటు విశేష సేవలు అందించిన వారి సేవలు ఎనలేనివని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అన్నారు. ఆలయంలో పది రోజులుగా సేవలు అందించి, దసరా ఉత్సవాలు ఘనంగా పూర్తి కావడానికి సహకారం అందించిన అర్చకులు సన్నిధిరాజు రామకృష్ణమూర్తి, కోట అనీల్ కుమార్, సిబ్బంది, ఎలక్ట్రీషియన్, శిల్పి ఎల్ వెంకట్రావు, మిద్దె పాండురంగారావు, కుంపట్ల శివ పద్మనాభ రావు, ఎం రాము తదితరులను శాలువాలతో ఆదివారం సత్కరించారు. యలమంచిలి మండలం పలు గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో కంకుమ పూజలు అనంతరం శమిపూజలు చేశారు. ఆదివారం డీజేలు, యువత నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో అమ్మవార్ల విగ్రహాలను వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలోని విశ్వదుర్గేశ్వరి అమ్మవారికి పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు దర్శించుకున్నారు. గంధం సతీష్, దాట్ల జగన్నాథరాజు, తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని దుర్గమ్మను ఆలయ ఈవో యాళ్ళ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఊరేగించారు. ప్రధానార్చకుడు కొత్తలంక శివసత్యనారాయణ బ్రహ్మత్వంలో పూజలనంతరం విచిత్ర వేషధారణల నడుమ అమ్మవారిని ఊరేగించారు. జనసేన నాయకులు చెరుకూరి జగత్ సోమశేఖర్, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.
- గణపవరం : సరిపల్లె గ్రామం, చినరామచంద్రపురం ఆలయం వద్ద విజయదశమి సందర్భంగా అగ్నిగుండం ప్రవేశం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినరామచంద్రపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద వెంకయ్య వయ్యేరులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.
- తణుకు/ఇరగవరం/అత్తిలి : తణుకు పట్టణంలోని బొమ్మల వీధిలో కొండాలమ్మ పీఠంలో ఆదివారం భవాని మాతకు విశేష పూజల అనంతరం నిమజ్జనం చేశారు. వావిలాల సరళాదేవి, వావిలాల పవన్‌కుమార్ అమ్మవారికి కుంభం వేసి హారతులిచ్చి పూజలు చేశారు. దువ్వ దానేశ్వరి అమ్మవారి సన్నిధిలో తెప్పోత్సవం నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రాధాకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్తిలి చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి డాక్టర్ కందుల శ్రీరామ్ కుమార్ దంపతులు, కందుల ఫణికుమార్ దంపతులు పూజలు చేశారు. భారీ అన్న సమారాధన జరిగింది. భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ నిర్వాహకులు కందుల సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని దుర్గమ్మను దర్శించుకుంటున్న ఈవో శ్రీధర్, భక్తులు


పాలకొల్లులో అర్చకులను సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు, తదితరులు

పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలి : మంత్రి నిమ్మల


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను నమోదు చేయించడంలో కూటమి నేతలు ముందుండాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. సదస్సుకు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో కూటమి నాయకులు భాగస్వాములు కావాలని తద్వారా కూటమి బలపరిచిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీ లభిస్తుందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఓట్ల నమోదును వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ వేపాడు చిరంజీవి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి పట్టణానికి వచ్చినమంతెన రామరాజును మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగరతో కలిసి టీడీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, బోణం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, జక్కంపూడి కుమార్, కోడి విజయకుమార్, పెన్మెత్స రామభద్రరాజు, జీఎస్ఎన్ సూర్యనారాయణరాజు, ధనాని ప్రకాష్, ఎస్.రజనీకుమార్, బొప్పన కిషోర్, పీతల శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

- కాళ్ళ : కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిత అవగాహన సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించిన వ్యక్తి గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పేరాబత్తుల రాజశేఖరం, జనసేన పీఏసీ సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, జుత్తిగ నాగరాజు, మంతెన పెద నరసింహ రాజు, వీరవల్లి శ్రీనివాసరావు, జుత్తిగ శ్రీనివాసరావు, ఎం.రామవరప్రసాద్ పాల్గొన్నారు.
- నరసాపురం : త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిష్ఠానం ఎవరికి టిక్కెట్ కేటాయించినా పార్టీ శ్రేణులంతా గెలుపే లక్ష్యంగా పని చేయాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం జనసేన కార్యాలయంలో పట్టభద్రుల ఓట్లు చేర్పుపై అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. టీడీపీ పరిశీలకులు చిరంజీవి జక్కం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, సంకు భాస్కర్, కొల్లు పెద్దిరాజు, గుగ్గిలపు మురళీ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలి

భీమవరం రూరల్, అక్టోబరు 13 : ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తోకతిప్ప గ్రామంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ అధికారం చేపట్టి వందరోజులైనా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు బర్రె రమేష్, మోకా మీరా సాహెబ్, సీపీఎం నాయకులు బొడ్డు లక్ష్మిపతి, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

తిరుపతిలో 'సమితి' సభ్యుల కోలాటం


తిరుపతిలో కోలాటంలో పాల్గొన్న రామకృష్ణ సమితి సభ్యులు

తణుకు, అక్టోబరు 13: తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈనెల 11న బ్రహ్మోత్సవాల్లో తణుకు రామకృష్ణ సేవా సమితి సభ్యులు, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పాల్గొని అక్కడ పలు ప్రాంతాల్లో కోలాట నృత్య ప్రదర్శనలు చేశారు. తిరుపతిరావు గురువు ద్వారా టీం లీడర్లు ఆలపాటి లక్ష్మి, దసం ధనలక్ష్మి, సుందరనెడి కళా బృందం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


2013 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 13 : వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో శ్రీవెంకటరెడ్డి నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2013 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు విదేశాల్లో నుంచి, దేశం నలుమూలల నుంచి వచ్చి తమ మిత్రులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీరావు మాట్లాడుతూ ఇలాంటి స్నేహం సమ్మేళనాలు వల్ల ఒక పండుగ వాతావరణం ఏర్పడుతుందన్నారు. మాజీ కాళ్ళ మండల విద్యాశాఖాధికారి గాదిరాజు కనకరాజు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధిని మిత్రుల మధ్య పంచుకోవడం శుభపరిణామన్నారు. తొలుత ఉపాధ్యాయులను, ముఖ్య అతిథులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

దేశాలమ్మకి వెండి మకర తోరణం


అమ్మవారికి వెండి మకరతోరణం తీసుకువస్తున్న రమణ దంపతులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 : స్థానిక లాకు దిగువన చింతల తోటలోగల శ్రీదేశాలమ్మకి భక్తులు, అడబాల గ్రూప్స్ అధినేత అడబాల వెంకట రమణ, వాణిశ్రీ దంపతులు సుమారు రూ.మూడు లక్షల విలువైన వెండి మకర తోరణం సమర్పిం చారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, చింతలతోట యువజన (ఆలయ) కమిటీ సభ్యులకు అందజేశారు. మకర తోరణానికి సంప్రోక్షణలు చేసి అర్చకులు మద్దిరాల జనార్ధన శర్మ అమ్మవారికి అలంకరించారు. వెంకట రమణ కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మందాలమ్మకి బంగారు కర్ణాభరణాలు


బంగారు కర్ణాభరణాలను అందజేస్తున్న భక్తులు

పెనుగొండ, అక్టోబరు13: వడలి గ్రామ దేవత మందాలమ్మకు రూ.రెండు లక్షల 34 వేల విలువ గల 34 గ్రాములు బంగారు కర్ణాభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న ఓరు గంటి నరసింహమూర్తి, పద్మావతి దంపతుల ద్వితీయ కుమారుడు శ్రీనివాస్, భార్య డాక్టర్ నందన దంపతుల కుమారుడు శ్రీషణ్ముఖ వల్లభ కుటుంబ సభ్యులు విజయదశమి పర్వదినం సందర్భంగా మందాలమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కర్ణాభరణాలను అందజేశారు. కమిటీ సభ్యులు ఉప్పలపాటి చంటి తదితరులు ఉన్నారు.

అయ్యప్ప దీక్షధారులకు అన్నదానం ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: పడాల అయ్యప్ప ఆలయ సముదాయంలో కొవ్వూరి గాంధీ రెడ్డి, హేమ మిత్రా నర్సారెడ్డి జ్ఞాపకార్థం అయ్యప్ప మాలధారులకు ప్రతి ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. గాంధీరెడ్డి సతీమణి అమ్మాజీ స్వయంగా స్వాములకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రంధి సత్యనారాయణ, నిమ్మల బాబ్జి, ద్వారంపూడి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం ప్రకటించిన వడ్డి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రావుపాలెంలో చర్చి నిర్మాణానికి వైసీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు విరాళం ప్రకటించారు. మండలంలో ఆదివారం పలు పరామర్శలకు వెళ్లిన ఆయన వెంకట్రావుపాలెం చర్చిని సందర్శించి నిర్మాణం మధ్యలో నిలిచిపోవడం గమనించి లక్ష రూపాయల విరాళం ప్రకటించి తక్షణమే రూ.30 వేలు అందించారు. జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి. శేషులత, నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎమ్మెల్యే నాయకర్ ఆకస్మిక తనిఖీ

నరసాపురం టౌన్, అక్టోబరు 13: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. జనరల్ వార్డు, ఆపరేషన్ థియేటర్ ప్రాంగణంలోని పరిశుభ్రత పనుల్ని పరిశీలించారు. అందుతున్న సేవల్ని రోగుల్ని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరతపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రి ప్రాంగణం, లోపల గదుల్ని శుభ్రంగా ఉంచాలన్నారు. ఆర్డీవో దాసి రాజు, సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రజ, రామకృష్ణ, గణేష్, జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఘంటా వేణుగోపాల్ ఉన్నారు.

వ్యవసాయంతో పాటు పశుపోషణ అవసరం


పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముత్యాల శ్రీనివాస్

పాలకొల్లు రూరల్, అక్టోబరు 13 : రైతులకు వ్యవసాయంతో పాటు పశువుల పోషణ చేపట్టాలని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. కాపవరంలో రైతు వారీ పాలకేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద రైతులకు రెండు పాడి పశువులు ఉంటే ఒక ట్రాక్టర్‌తో సమానం అన్నారు. ఆరుగాలం శ్రమించే రైతులు రెండు పాడి పశువులను పెంచుకోవడం ద్వారా ప్రతీ నిత్యం ఆదాయం పొందచవ్చన్నారు. పాలకేంద్రం నిర్వాహకుడు కసుకుర్తి రమాకాంత్, గ్రామస్థులు కసుకుర్తి బుల్లిరాజు, సర్వేశ్వరరావు, రామకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

నరసాపురం టౌన్, అక్టోబరు 13: ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా స్వచ్ఛంద సంస్థలు సేవాకార్యక్రమాలు చేపట్టాలని ఆర్డీవో దాసిరాజు కోరారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తణుకుకు చెందిన ఎన్ఆర్ఐ నరహరశెట్టి గణేష్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రజ, క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, గన్నాబత్తుల సత్యవతి, బొమ్మిడి సూర్యకుమారి, ఆత్మూరి రమ, భవానీ విజయ్, కోట్ల రామ్‌కుమార్, తోట శ్రీధర్, బ్రహ్మాజీ, కనకం ప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : సీఐ

భీమవరం క్రైం, అక్టోబరు 13 : భీమవరం రెండో పట్టణంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచామని, నడవడిక మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో నేరాలు చేసి బెయిల్‌పై వచ్చి మళ్ళీ కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.

'శ్రీకృష్ణ కల్యాణ కింకిణి' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ఆర్డీవో, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొత్తపల్లి, తదితరులు

నరసాపురం, అక్టోబరు 13 : శ్రీకృష్ణ కల్యాణ కింకిణి పద్యకావ్యం సాహితీ ప్రియులకు ఆభరణమని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అభివర్ణించారు. నరసాపురానికి చెందిన పేరాల రామలింగేశ్వర రావు శత జయంతిని పురస్కరించుకుని అక్షరోత్సవ కార్యక్రమం స్థానిక వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు రచించిన శ్రీకృష్ణ కల్యాణ కింకిణీ అను రుక్మిణీ కల్యాణ పద్య కావ్య పుస్తకావిష్కరణను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ సాహితీ ప్రియులైన పేరాల కుటుంబం నుంచి రామలింగేశ్వరరావు రచించిన పద్యకావ్యం అనురూపమన్నారు. అనంతరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం, శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్ మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వైఎన్ కళాశాల సెక్రటరీ చినిమిల్లి సత్యనారాయణ, చక్రవధానులు రెడ్డప్ప దవేజీ, పేరాల మోహన్, పేరాల శ్రీనివాస్, సత్యానంద్, స్వరాజ్యలక్ష్మి, పేరాల హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ఏకాదశి అర్చనలు

అత్తిలి, అక్టోబరు 13 : గుమ్మంపాడు శ్రీహరి ప్రహ్లాదపురంలో గల సుబ్రహ్మణ్యేశ్వర గోమహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన నిర్వాహకుడు పులవర్తి రవీంద్ర ఫణిగోపాల్, అర్చకుడు శ్రీహరి గోపాల్ ఆధ్వర్యంలో స్వామికి అర్చనలు, పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ, పూర్ణిమ, మలకపాటి విశ్వభారతి భక్తులకు అన్నదానం చేశారు.